గింజుకుంటూ అన్నాను " నా కొడుకు"

ప్రసాద్ విగతజీవి ఐపోయాడు.

"మరొక్క ప్రాణి. చాలు... తొందరగా చెప్పు. నీదా, నీ స్నేహితుడు రామనాధానిదా?"

నా పీక మీదవేళ్లు బిగుసుకుంటున్నాయి. భయంతో కొయ్యకట్టుకుపోతూ చెప్పేశాను.

"రామనాధానిదే."

మృత్యుదేవత నవ్వుతూ వెళ్ళిపోయింది. అప్పుడు నాకనిపించింది. మనిషి స్వార్థపరుడు. ప్రపంచాన్నంతటినీ బలిపెట్టి అయినా సరే తన ప్రాణంకోసం తాపత్రయ పడతాడు. భార్యనీ, పుత్రుడునీ, స్నేహితుణ్ణీ కోల్పోయి దుఃఖాతిశయంలో మునిగిపోయాను. పశ్చాత్తాపంతో, విచారంతో కదలలేక కట్టెలా ఐపోయాను నేను. నా భార్య పలకరింపుతో ఆశ్చర్యంగా కదిలాను.

ఓహో! ఇదంతా కలే అన్నమాట, ఎవరూ చనిపోలేదు. నిజానికి.

ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ ఆవిడ భుజాలమీద చేయి వేసి ఉద్రేకంగా అన్నాను. "సృష్టిలో తీయనిది స్నేహమే, కాని తియ్యనిది మాత్రం ప్రాణమే. సొంతప్రాణం. మరేమీ అనుకోకు, నన్ను క్షమించు."

తెల్లబోయి చూస్తూందానిద నా వైపు. జీవితం యింతే. ఉండుండి ఓ మొట్టికాయవేసి నవ్వేవాడిని ఏడిపిస్తుంది. ఓ చిటిపి పనిచేసి ఏడిచేవాళ్లను నవ్విస్తుంది. జీవితాన్ని పూర్తిగా తెలుసుకోగలగడం - గాలిని బంధించబోవడమే! పూర్తిగా కళ్ళు తెరిచాను.

✡ ✡ ✡ ✡ ✡

# విద్య యొసగును...

అర్ధరాత్రి !

చీకూచింతా ఉన్నవాళ్ళూ చీకటి వ్యాపారాలు చేసేవాళ్ళూ తప్ప మామూలు మనుషులు గుర్రుపెడుతూ గాఢంగా నిద్రపోయే వేళ.

సముద్రపు వొడ్డు.

దిక్కులేని వాళ్ళూ బలవంతంగా చావాలనుకునే వాళ్లూ తప్ప మరెవరూ ఆ వేళలో మసలని చోటు.

ఆ అర్ధరాత్రి సముద్రతీరంలో ఆశ్చర్యకరంగా ఒకరు కాదు ఇద్దరున్నారు !

చాలాసేపటి నుంచి వాళ్లిద్దరూ ఒకరినొకరు అసహనంగా చూసుకుంటూ అలాగే కూర్చున్నారు. వారు వెళ్తారేమో అనీ వీరూ, వీరు వెళ్తారేమో అని వారూ ఆశపడుతూనే అవతలి మనిషి ఉనికికి అసహనం చెందుతున్నట్లున్నారు.

సంఘజీవి అనిపించుకునే మనిషి ఒంటరిగాను పుడతాడు. అర్ధాంతరంగా ఆత్మహత్యకు తలపడే మనిషి ఒంటరిగానే చావాలను కుంటాడు. చావుకంటే బ్రతుకే బహుభయంకరమై పోయిన యీ రోజుల్లో వాళ్ళిద్దరూ అక్కడకి ఆత్మహత్య చేసుకుందుకే వచ్చి చేరినా ఆశ్చర్యపోయేందు కేమీ లేదు. మామూలు మనుషులకి జీవితం నరకం కంటే కూడా నికృష్టమైపోయింది.

ఎదురుచూసి ఎదురుచూసి విసుగొచ్చింది కాబోలు వాళ్లిద్దరూ ఒకరి నొకరు పలకరించుకోకుండా ఉండలేకపోయారు.

"ఏమన్నా... ఏదీ కానియేళ యీ తట్టుకొచ్చావ్? సూడబోతే సదువుకున్న బాబులాగున్నావ్."

"నును నిన్నడగాలనుకుంటూంటే నువ్వే అడిగేశావ్" ఆశ్చర్యం వెలిబుచ్చాడతను.

"దానికేం భాగ్యం? సెబుతాను కాని తొలుత నిన్ను నేనడిగాను కనక ముందు నువ్వు సెప్పు అనక నా సంగతి నే సెబుతా. చల్లకొచ్చి ముంత దాచే రకాన్ని కానులే" ఆ మాటలలో న్యాయంతోపాటు అమాయకత్వం కూడా గోచరించింది.

"నీ పేరేమిటి తమ్ముడూ?" అప్యాయంగా అభిమానంగా అడిగాడు.

"ఒక పేరని లేదు. అసలు పేరు అప్పన్న. అప్పడూ, అప్పిగా, అప్పూ... రకరకాలుగా పిలుస్తారు. పలుకుతూంటాను నాకో బతుకూ లేదు"

"నాపేరు గోపి. నాది కథకాదు, వ్యధ. అందుకే ముందు నువ్వు చెబితేనే బాగుంటుందనుకుంటాను"

"నాదీ కమ్మని కథ కానేకాదు సొదే. సరే... ముందు నేనే సెబుతాను. నా సంగతి. యినుకుని తోవజూపు. సదువుకున్నోడివి గద?" అంటూ తన విషయం మొదలు పెట్టాడు.

"నా కుర్రతనంలో మా అయ్య సంగతి బాగానే ఉండేది. రోజూ నాల్డబ్బులు కళ్ల జూసేవాడు. అందుకనినాకు సదువు చెప్పించాలని బళ్లోవేశాడయ్య. కాన్నేను బలాదూరు తిరుగుతూ అచ్చరమ్ముక్క నేర్చుకోలేదు. రోడ్లంటా, దొడ్లంటా తిరుగుతూ ఎందుకూ పనికిరాకుండా పోయాను. పదారేళ్ళొచ్చాయి. అయ్యకు సత్తువా తగ్గిపోయింది, సంపాదనా తగ్గిపోయింది. కొడుకును కదా! నా మీద ఆశపడ్డాడు. యింతకి నాల్డబ్బులు తెచ్చిత్తానేమో అని. నా కేటయినా సేతవుతేనా? సివరకు నన్ను రెండిళ్లలో కుదిర్చేసేడు. అవి యిళ్ళు కావు. ఒకటేమో స్టూడెంట్ల లాడ్జింగు, మరొటేమో ఆఫీసర్ల లాడ్జింగు. రూములూడవడం. నీళ్ళెట్టడం... బోజనాలు తేవడం, ఒకటేమిటి. అళ్ళు సెప్పిన పనల్లా సెయ్యాల. పనికేటీ బాదపడను. వాళ్ళు బాసలో కిచకిచలాడుకుంటారు. యికయికలాడతారు, పకపకలాడతారు. నాకేటీ అరదం కాదు. చెవిటోడిలా ఉండిపోతాను. స్టూడెంటు బాబులు సదువుకుంటుంటారు. ఆఫీసరు బాబు లింటికాడ ఉన్నంతసేపూ కిచకిచలే. ఈళ్లు మేడమీద... అళ్లు కిందా. అందరికీ నేను పనిచేసే యంత్రాన్ని. నా కెండలేదు, వానలేదు, పగల్లేదు, రాత్రి లేదు. ఆళ్లకి తలనొచ్చితే గోళీ, కాళ్లు లాగితే డ్రింకు. పగలంతా సచ్చిసచ్చి ఉన్నా అయిగా కన్నుమూసి కునికేందుకే ఉండదు నాకు. అప్పుడప్పుడు నా మీద నాకే అసయ్యమేసేది. ఈ స్టూడెంటు బాబుల్లా సదువుకుంటే ఆ ఆఫీసరు బాబుల్లా అయిగా దరిజాగా బతికేవాణ్ణికదా? చస్... నేనెంత తెలివిమాలినోణ్ణి అయ్య బళ్లో వేయించినా అచ్చరాలు నేర్చుకున్నాను కాదు. ఇప్పుడేమో వొయసుదాటిపోయి విద్య అబ్బదు. ఇక నా బతుకింతే. సచ్చేవరకూ నానిలా నౌకరులా పడుండవలసిందే. ఏం జబమ యిది..." టూకీగా తన సొద వెళ్లబుచ్చుకున్నాడు అప్పన్న. "సక్కగా సదువుకుంటే యిప్పుడు నాకీ తిప్పలుండేవి కావుకదా? సిన్నప్పుడు సదివితే పెద్దయ్యాక సుకపడేవాడిని కదా?" అప్పన్న గొంతు నిండా పశ్చాత్తాపం చేజారిన పెన్నిధిని తలచుకుంటూ

చింతిస్తున్నట్లున్నాడు. అతనివేపు ఆశ్చర్యంగానూ జాలిగానూ చూశాడు గోపి. మెల్లగా తన కథ మొదలు పెట్టాడు.

"మాదో చిన్న పల్లె. నాలుగైదు వందల గడప ఉంటుంది. నా చిన్నతనంలో అక్కడ ఓ మాస్టారుండేవారు. ఊరివారి దయాధర్మాల మీద బతుకుతూ ఊరికే ఉండటమెందుకని కాస్త నలుగురి పిల్లలనీ చేరదీసి ఏ చెట్టుకిందో గట్టు మీదనో కూర్చోబెట్టి నాలుగు ముక్కలు చెప్పేవారు. దురదృష్టవశాత్తూ ఏ చెట్లులేని ఆ చోట నేనే అమృతం మొక్కనయ్యాను. ఓసారి మాస్టారు మా అయ్యని పిలిచి "నీ కొడుకు చురుకయిన వాడు. శ్రద్ధ కలవాడు, సరస్వతీ కటాక్షం ఉంది. చదివించు, వృద్ధిలోకి వస్తాడ"న్నారు.

అప్పటికి మేము సుఖంగా బతుకుతున్నట్లు లెక్క... మా అయ్యకి చిన్న యిల్లూ, కొంచెం పొలం ఉండేది. హాయిగా వెళ్లిపోతున్న రోజులు. పల్లెలో అదే పదివేలు.

మాస్టారి మాటలకు మా అయ్య ముఖం ఒక్కసారి చాటంతయిపోయింది. "మా గోపి గాడికి సదువొత్తాదంటారా! సదూకుని కలకటేరౌతాడా?" అంటూ కళ్లల్లో ఆశలు ఊపిరి పోసుకున్నాయి.

"నువ్వు చదివిస్తే కలక్టరే ఔతాడో, గవర్నరే ఔతాడో? అయ్యకు ఊపొచ్చేసింది. "చదివిత్తాను నా కొడుకుని కలకటేరుని జేస్తాను పట్నం వెళ్లి సదివిస్తాను. మొగాడు... మొదటోడు... నా కొడుకు ఔతాడీ పల్లెలో" పట్టుదలగా గర్వంగా అన్నాడు.

చదువు సంగతెలా ఉన్నా పట్నమంటే సరదా నాకు. రైలెక్కి వెళ్లొచ్చు.

నానా పుర్రాకులూపడి నన్ను పట్నం బళ్లో చేర్పించి. "బుద్ధిగా సదూకో, నా కళ్లతో నిన్ను కలకటేరుగా సూడాల" అనిచెప్పి వెళ్ళిపోయాడయ్య.

నేను బాగానే చదివే వాడిని. ఫస్టు మార్కులు కాకపోయినా మంచి మార్కులే వచ్చేవి. హైస్కూలు చదువయ్యాక ఇంటికి వెళ్లాను – శెలవులకి.

"కలకటేరువయ్యావా?" గడపలో అడుగు పెడుతూనే నన్ను చూసి అయ్య అడిగిన మొదటి ప్రశ్న అది. గడపదాటి వారణాసెంతదూరం అని అడిగినంత అమాయకత్వపు ప్రశ్న అయ్యది.

మెల్లగా చెప్పాను. "కాలేజి చదువూ అదీ అవ్వాలి. ఆరేడేళ్లు చదవాలి. అప్పుడు..." ఆగి "చదివిన చదువుకి ఇంట్రోతు ఉద్యోగం దొరకడం కూడా అనుమానమే" అన్నాను.

"ఇంకా ఆరేడేళ్లా?" కళ్లనిండా భయమూ దిగులూ, గొంతునిండా ఆయాసమూ సంశయమూ.

ఇంతలో పల్లె అంతా యింటిముందు కొచ్చింది నన్నుచూసి పోవడానికి. పట్నం చదువు చదువుతూ వచ్చిన నన్ను వాళ్లంతా వింతగా మెచ్చుకోలుగా ఈర్ష్యగా రకరకాలుగా చూసి, పలకరించి వెళ్లాక అమ్మ ఎర్రని నీళ్లు దిష్టితీసి పోసేశాక అయ్య ముఖంలోకి మళ్ళీ కళ వచ్చింది.

"సదువు సాగించు, ఎలాగయినా నువ్వు కలకటేరు కావలసిందే నేనిన్ను నా కళ్లతో కలకటేరుగా చూసి తీరవలసిందే" పట్టుదలగా అన్నాడు. తెగించినట్లున్నాడు.

నా కెందుకో మా యిల్లు మునపటిలా... అప్పటిలా ఉన్నట్లనిపించ లేదు ఏదో మార్పు... సరిగా అర్థం కాలేదు. కాలేజీలు తెరవడంతో పట్నం వెళ్లిపోయాను. డిగ్రీ తీసుకున్నాక మళ్లీ యింటికి వెళ్లాను శెలవులకి. ఇంటి పరిస్థితి చూసేసరికి నాకు మతిపోయింది. ఏడుపొచ్చింది.

అయ్య పొలం అమ్మేశాడు. ఇల్లు తాకట్టు పెట్టేశాడు. అమ్మ కూలిపనులకీ కోతలకీ వెళ్తోంది.

మునుపు – రెండు పూటలా వరన్నం తినే మా వాళ్ళు యిప్పుడు రోజుకో సారి గెంజితాగుతున్నారు. మనుషులు చిక్కి శల్యాలయ్యారు. చెల్లి చిరిగిన గుడ్డలతో రోజులు గడుపుతూంది. అయ్య అప్పుల పాలయ్యాడు. ఇల్లు చితికిపోయింది.

ఆత్రంగా అడిగాడయ్య. "కలెకటేరయ్యావా?"

"దానికి పరీక్షరాయాలి. ఇక్కడుండే చదవచ్చు." అనేశాను తల వంచుకుని.

"ఇంకా ఆగాలా?" దీనంగా బేలగా చూశాడు అయ్య.

నా తల తీసి ఎక్కడ దాచుకోవాలో అర్థంకాలేదు. నేను హైస్కూల్లో చేరక మునుపు హైస్కూలు చదువుకి ఇంత్రోతా వుద్యోగమో గుమస్తాపనో దొరికేవి. నేనది చదివేసరికి ఆ ఉద్యోగాలు పట్టభద్రులకే అందరానివైపోయాయి. నేను పట్టభద్రుడినయ్యేసరికి పరిస్థితి మరీ విషమించింది. చూడబోతే నా కసలు ఉద్యోగమొస్తుందో రాదో సందేహమే. ఈ దారుణమైన నిజం అయ్యకి ఎలా చెప్పేది? చెబితే విని నిలదొక్కుకోగలడా?

చదువు పేరుతో నేను నా వాళ్ళనందరినీ నానా యిడుములపాలూ చేశాను. వాళ్ళ నోటి ముందరి కూటిని లాక్కున్నాను. ,ఆ చదువు నా వాళ్ళ చెమట. రక్తం. సర్వసుఖాలు... నా ఒక్కడి అభివృద్ధినీ కాంక్షించి వీళ్ళందరూ ఎంతెంత త్యాగం చేశారు! ఎంతగా రుణపడి పోయానో వీళ్ళందరికీ..! ఏం చేసి... ఎంత తొందరలో నేను మా వాళ్ళ రుణం తీర్చుకుని... వీళ్ళని సుఖ పెట్టగలను. మొదలయింది నా తపన. భద్రంగా దాచిన పట్టాతో పట్ట భద్రుడినయిన నేను ఏదో ఒకుద్యోగం కోసం విశ్వప్రయత్నాలు చేయసాగాను. తక్షణావసరం ఏదో ఒక ఉద్యోగం.

ఉద్యోగ ప్రయత్నాలకు కూడా ఎక్కువ పెట్టుబడే ఉండాలి; అప్లికేషన్లు పెట్టడానికీ, వాళ్ళు చెప్పిన చోటుకు వెళ్ళి వ్రాతపరీక్షలు వ్రాయడానికీ, ఇంటర్వ్యూలకు హాజరవడానికీ. కునికే నక్క మీద తాటిపండున్నట్లు... నిరుద్యోగుల మీద యిదో భారం! అయ్యనడగడానికి సిగ్గువేసేది. కాని తప్పేది కాదు. ఆయింట్లో... ఆ మనుషుల మధ్య... ఆ ఊళ్ళో... ఉండలేకపోతున్నాను. తప్పుచేశానన్న భావన అక్కడి నుంచి తప్పించుకోమని తొందర పెడుతూంది.

"నేడో రేపో మా వాడు కలకటేరౌతాడు. మేం మళ్ళీ మా పొలం కొనేసుకుంటాం." అని అయ్య నలుగురికీ చెబుతూంటే నా ప్రాణం పైనేపోతున్నట్లుండేది.

కలక్టరు కాదు. కనీసం బిళ్ళ కలక్టరయినా కాగలనన్న నమ్మకం లేదయ్యా అని చెప్పెయ్యాలనుకునే వాడిని. కాని నోరు పెగిలేది కాదు.

"బిడ్డ కలకటేరు కాగానే గుడిసె తీయించేసి మేడేసేస్తాడు ఆడంగులకి అమాయకంగా చెప్పే అమ్మకి – 'అమ్మా నీ కొడుకు చదివిన చదువు గుడిసెలు పీకించేసేదే కానీ మేడలు వేయించగలిగేది కాదు. అయ్యా! నాది పొలాలమ్మించే చదువే తప్ప కొనిపించే చదువు కాదు. అని అరచి చేదు నిజం ఆ నిష్కల్మష హృదయాలకి తెలియజెప్పాలని ఉద్రేకం కలిగేది.

"అన్నా నువ్వు కలకటేరు కాగానే ఆకుపచ్చ పట్టు పరికిణీ కొని పెడతావు కదూ?" అని అమాయకంగా అడిగే చెల్లి ముఖంలోకి చూసే ధైర్యం ఉండేది కాదు నాకు. పల్లెలో ఎదురయిన ప్రతివాడూ "కలకటేరెప్పుడౌతావ్" అని అడుగుతూంటే వాళ్ళ మొకం చూడడానికి పిరికిగా.. అపరాధిలా... తల వంచుకుని వెళ్ళిపోయే వాడిని మౌనంగా. నిజం బయట పెట్టలేకా, అబద్ధం దాచలేకా నాలో నేనే సతమౌతూ గడిపేవాడిని. ఎవరు మాత్రం ఎంత కాలం భరించ గలరు? ఎప్పుడో నోరుజారి

నిజం చెప్పేస్తానేమో అని భయం..."

"నిజం సెప్పడానికి భయమా?" ఆశ్చర్యపోయాడు అప్పన్న.

"అది నా దురదృష్టం తమ్ముడూ. అమాయకులయిన అమ్మనీ అయ్యనీ మోసగించ వలసి వస్తూంది"

"అమ్మనీ అయ్యనీ మోసగించడమా?" ఆగి "చదువు కున్నోడివి..."

"చదువుకున్న వాడిని కనుకనే. నోటి ముందరి కూటిని లాక్కున్నా ఫర్లేదు కాని కంటి ముందు కలలను పగలగొట్టడం నేరం".

"అంటే... బతకలేకా...?" ఆశ్చర్యంగా చూశాడప్పన్న.

"ఔను. అంతే"

"బతకడానికెన్ని దారులు లేవు? రిక్షాలాగొచ్చు... మూటలు మొయ్యొచ్చు. ఏ హోటల్లోనో కప్పులు కడగొచ్చు... అటువంటి పనులు చేస్తే పరువుతక్కువనా?"

"అదేమీ కాదు. పనిచెయ్యక పోతేనే పరువు తక్కువ కాని, చేస్తే కాదు. నా వరకూ అయితే నేనేపని చెయ్యడానికయినా సిద్ధమే. కాని, దొంగల తల్లి కేడవ భయమని నేను అమ్మగురించీ అయ్య గురించీ పల్లె గురించీ ఆలోచిస్తూ వెనుకంజ వేయవలసి వస్తూంది. కలక్టరు కాలేకపోతే కనీసం క్లర్కయినా కాకుండా రిక్షాలాగానంటే మా అయ్య గుండె పగిలిపోతుంది. తల్లికీ, చెల్లికీ, పల్లెకీ అందరికీ చదువంటే విశ్వాసం పోతుంది. నావల్ల విద్యకే విలువ పతించి పోతుంది." నిట్టూర్చి... "నేను చదువులోకి దిగకపోతే మాకు పొలం ఉండి ఉండేది. ఉద్యోగం కోసం పెట్టిన ఖర్చుతో మంచి కిళ్ళీకొట్టయినా పెట్టుకుని హాయిగా బతకగలిగేవాళ్ళం. ఈ చదువు నా బతుక్కీ భవిష్యత్తుకీ సంకెళ్ళు వేసి బందీని చేసి వదిలింది." విచారంగా తల పట్టుకుని "నన్నూ మా కుటుంబాన్నీ నాశనం చేసింది. నేనే చదువుకోకుండా ఉంటే..." అన్నాడు.

అప్పన్న తెల్లబోతూ చూశాడు. వాడి ఆశ్చర్యానికంతులేదు.

(1979లో ఆంధ్రభూమి వీక్లీ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందినది)

✡ ✡ ✡ ✡ ✡

# మెరుపు

రాత్రి - పది గంటలు దాటుతున్న వేళ. రోడ్డుమీద అట్టే మంది జనం లేరు. కాని ఉన్న కొద్దిమందీ అతన్ని ఓ సారి చూసిన వారు మరోమారు చూడకుండా ఉండలేక పోతున్నారు. ఆశ్చర్యపడకుండానూ ఉండలేక పోతున్నారు. ఎందుకంటే అతను ఖరీదైన సూటూ, బూటూ వేసుకుని, చక్కని కళ్ళజోడు పెట్టుకుని అడ్వర్టయిజ్‌మెంట్ మోడల్‌లా, సినిమాల్లో హీరోలా అందంగా, దర్జాగా ఉండటమే కాక ధీమాగా, ఠీవిగా, హుందాగా నడుస్తున్నాడు. చూడగానే ఏ జమీందారో అనిపించేటట్టున్నాడా అందమైన